క్లుప్తంగా

కంటి వైద్య శిబిరం



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 65 మందికి పరీక్షలు చేసి ఏడుగురికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. 21 మందికి కంటి అద్దాలను రెఫర్ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కోశాధికారి కాశిరెడ్డి, శేఖర్, వేణు, సంతోష్, వైద్యులు శివకుమార్, పూజారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



కామారెడ్డి రూరల్: హరితహారంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీవో మలహరి సూచించారు. శుక్రవారం వాటరింగ్‌డేను పురస్కరించుకుని కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మొక్కలకు నీళ్లు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి మనుగడ మొక్కలపైనే ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలకు నీళ్లు పోస్తూ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



భిక్కనూరు: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని అంతంపల్లి సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో వంద శాతం పన్నులను చెల్లించి సహకరించాలన్నారు. ఎంపీటీసీ మంజులా సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్నేహ తదితరులు పాల్గొన్నారు.

తేనీటి విందులో ఎమ్మెల్యే తోట

నిజాంసాగర్(జుక్కల్): శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన తేనీటి విందులో శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రాష్ట్రపతికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

దోమకొండ: దోమకొండ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం రాత్రి మండల కేంద్రంలో ముగ్గురు మహిళలపై దొంగలు అనే అనుమానంతో దాడి చేసిన విషయంపై ఆయన ఆరాతీశారు. ఈ కేసు విషయాలపై ఆయన ఎస్సై మురళితో మాట్లాడి పలు సూచనలు చేశారు. నేరాల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. భిక్కనూరు సీఐ తిరుపతయ్య, ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యాచారి, సిబ్బంది ఉన్నారు.

నస్రుల్లాబాద్‌లో వాహనాలు..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై వెంకట్ రావు ట్రాఫిక్ నిబంధనలు పాటించని వావాహదారులకు జరిమానా విధించారు. పెండింగ్ చలానాలు ఉంటే వెంటనే చెల్లించాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారికి అవగాహన కల్పించారు.

బ్రెయిలీ కిట్ల పంపిణీ



ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భవిత కార్యాలయంలో శుక్రవారం ఎంఈవో వెంకటేశం దివ్యాంగ విద్యార్థులకు బ్రెయిలీ కిట్లను పంపిణీ చేశారు. భవిత కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అలింకే సంస్థ ఆధ్వర్యంలో బ్రెయిలీ కిట్లను అందజేశారు. భవిత సిబ్బంది శివకుమార్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు

హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జలాల్‌పూర్‌లో చేపట్టిన హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణం కోసం రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఆయనవెంట సర్పంచ్ కృష్ణ ఉన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- జుక్కల్ నియోజకవర్గ పరిధిలో అక్రమంగా కలప రవాణా
- పట్టించుకోని అధికారులు



బ్రాహ్మణపల్లి, అచ్చంపేట శివార్లలో రవాణాకు సిద్ధంగా ఉన్న కలప దుంగలు

నిజాంసాగర్(జుక్కల్): 'వృక్షో రక్షిత..రక్షితహ:' సూత్రాన్ని పాటించే అటవీ శాఖ అధికారులు పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు బలి అవుతున్నా పట్టించుకోవడం లేదు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద, డోంగ్లి, మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్గల్, పిట్లం, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. పంట చేనుగట్లతో పాటు అటవీ ప్రాంత భూముల్లో ఏపుగా పెరిగిన నీలగిరి, వేప, తుమ్మ వృక్షాలు నరికి వేస్తూ కలప దుంగలను తరలిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం పట్టా భూముల్లోని చెట్ల నరికి వేతకు రెవెన్యూ, అటవీ శాఖ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. కానీ గ్రామాల్లో పంట పొలాల వద్ద ఉన్న చెట్లకు బేరం పెడుతూ కొందరు వ్యాపారులు కలప వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. నయానో, భయానో డబ్బులు చెల్లిస్తూ చెట్లను నరికి వేస్తూ కలపను సామిల్లులకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రూ.లక్షల విలువ చేసే కలపను తరలిస్తూ చెట్ల ప్రాణాలను బలితీసుకుంటున్నారు.

పంటపొలాలు, రోడ్లు, అటవీ ప్రాంతాల్లో..

నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట, బ్రాహ్మణపల్లి, ఆరేడ్, ఆరేపల్లి, మాదపల్లి, మంగ్లూర్, నర్సింగ్‌రావ్ పల్లి, వెల్గనూర్, మల్లూర్, జక్కాపూర్, ఒడ్డేపల్లి గ్రామాల పరిధిలో పచ్చని చెట్లను నరికి వేస్తూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అచ్చంపేట అడ్డదారి నుంచి బ్రాహ్మణపల్లి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు కావడంతో వ్యాపారులు చెట్లపై కన్నేశారు. బ్రాహ్మణపల్లికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లతో పాటు అటవీ ప్రాంత గుట్టలపై ఉన్న చెట్లను నరికేశారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లో పంట పొలాల గట్లపై ఉన్న చెట్లను యంత్రాలతో కోత కోసి కలపను రవాణా చేస్తున్నారు.

పర్యవేక్షణ లేక..

అటవీ ప్రాంతాలతో పాటు గ్రామాల వైపు అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు దళారుల కలప రవాణా వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లు కొనసాగిస్తున్నారు. అధికారులు మామూళ్లు తీసుకోవడంతో కలప వ్యాపారానికి అడ్డు అదుపులేకుండా పోతుంది. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ఇకనైనా స్పందించి వాల్టా చట్టాన్ని కాపాడి చెట్లపై గొడ్డలి వేటు పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

'నాగమడుగు' పనులకు సహకరించాలి

- బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు



గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు రైతులు సహకరించాలని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు కోరారు. శుక్రవారం మహమ్మద్‌నగర్ మండలంలోని కొమలంచలో నాగమడుగు ఎత్తిపోతల పనులపై రైతులతో సమావేశం నిర్వహించారు. మంజీరా నదిలో నాగమడుగు ఎత్తిపోతలు నిర్మాణం చేపడుతున్నందున్న మట్టి కట్ట, ట్యాంక్ బండ్ పనుల సర్వేకు రైతులు సహకరించాలన్నారు. ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి ప్రభుత్వం పరిహారం అందిస్తుందని చెప్పారు. సమావేశంలో నీటి పారుదల శాఖ ఈఈ సోలోమాన్, మహమ్మద్‌నగర్ తహసీల్దార్ క్రాంతి కుమార్, గిర్దావర్ అంజయ్య తదితరులు ఉన్నారు.

ఇస్కాన్ క్యాలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి: ఇస్కాన్ నూతన సంవత్సరం క్యాలండర్‌ను శుక్రవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. గీతా జయంతిని పురస్కరించుకొని ఇస్కాన్ కామారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న గీతా మారథాన్, భగవద్గీత పుస్తక వితరణ కార్యక్రమాలను ఎమ్మెల్యేకు ప్రతినిధులు వివరించారు. ఇస్కాన్ కామారెడ్డి జిల్లా కో–ఆర్డినేటర్ వెంకటదాస్, యుగళ కిషోర్‌దాస్ భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

దోమకొండ:మండలకేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం జరిగే వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొనాలని కోరుతూ శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు లింగ రాజేందర్, ప్రతినిధులు ఉన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

దోమకొండ: మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని శుక్రవారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఆలయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దీనిని నిర్మించగా ఆయన ప్రారంభించి జరిగిన పూజల్లో పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్, తదితరులున్నారు.

ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి



భిక్కనూరు శ్రీ వేంకటేశ్వరాలయం ప్రాంగణం

భిక్కనూరు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా భిక్కనూరు మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో శనివారం నిర్వహించనున్న ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, ప్రతినిధులు చీకోటి వెంకటేశం, బొందుగుల నాగరాజయ్య, బొందుగుల సత్యనారాయణ, పబ్బ నాగార్జున్‌లు తెలిపారు. భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశం కల్పిస్తామని చెప్పారు.

నేడు చుక్కాపూర్‌లో ..

మాచారెడ్డి: చుక్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం నేరుగా ఉత్తర ద్వారం దర్శనం చేసుకోవాలని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావులు తెలిపారు.

కామారెడ్డిలో ఏర్పాట్లు పూర్తి

కామారెడ్డి అర్బన్: వైకుంఠ(ముక్కోటి) ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారు జాము నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం కామారెడ్డి పట్టణంలోని శ్రీవైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రధానంగా పంచముఖి శ్రీహన్‌మాన్ ఆలయ ప్రాంగణలోని శ్రీవేంకటేశ్వర ఆలయం, పెద్ద బజార్‌లోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంతో పాటు సిరిసిల్ల రోడ్డులోని గీతా మందిరం, వివేకానంద కాలనీలోని శ్రీకోదండ రామాలయం, దేవునిపల్లి శ్రీరమా సత్యనారాయణ స్వామి, అశోక్‌నగర్‌లోని శ్రీగోదాదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, దర్శన ఏర్పాట్లు చేశారు. గీతా మందిరంలో గీత జయంతి సందర్భంగా భవగద్గీత పారాయణం నిర్వహిస్తున్నారు.

ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ దీక్ష



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు

కామారెడ్డి టౌన్: పార్లమెంట్‌లో ఇండియా కూటమి ఎంపీలను అకారణంగా సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో నిజాంసాగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ..ఎంపీలను సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. దేశ భద్రత విషయంలో పార్లమెంటులో ప్రభుత్వాన్ని నిలదీయడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ప్రజలే బీజేపీకి తగిన బుద్ధి చెబుతారని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి విమర్శించారు. దీక్షలో జెడ్పీటీసీలు నారెడ్డి మోహన్‌రెడ్డి, తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోనే శ్రీనివాస్, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని జీవదాన్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వామపక్ష నాయకుల నిరసన



కామారెడ్డి టౌన్: పార్లమెంట్‌లో ఎంపీలను సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేశారని బీజేపీపై మండిపడ్డారు. నేతలు వెంకట్ గౌడ్, దశరథ్, ప్రకాష్, జబ్బర్ నాయక్, మోతిరాం, సంతోష్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలపై విద్యార్థుల అధ్యయనం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం దోస్తుపల్లి గ్రామాన్ని శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆయా రాష్ట్రాల విద్యార్థులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అధ్యయనం చేశారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ, పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రం, ఆశా కార్యకర్తల సేవలు, రేషన్ పంపిణీ, ఐకేపీ మహిళా సంఘాలు, వ్యవసాయం, ఉపాధి పనుల కల్పన వివరాలను గ్రామ సర్పంచ్, కార్యదర్శి, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర అభివృద్ధికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. పలు పాఠశాలల్లో గణితంపై క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే గణిత శాస్త్ర పరికరాలను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థినులు గణిత ముగ్గులు వేశారు. – సాక్షి నెట్‌వర్క్



వెంకట సాయి పాఠశాలలో గణిత ప్రదర్శనలు



తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంకర రాళ్లతో శ్రీనివాస రామానుజన్ చిత్రం



దేశాయిపేటలో గణిత ఉపాధ్యాయులకు సన్మానం



గణిత ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



టీజీవీఎస్ సంస్కార్ పాఠశాలలో 1729 ఆకారంలో..



లింగంపేట: వేడుకల్లో టీచర్లు, విద్యార్థులు



తాడ్వాయిలోని రవీంద్ర భారతి పాఠశాలలో..



తాడ్వాయిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకుడు సతీష్‌కు సన్మానం



అక్కాపూర్ పాఠశాలలో గణిత ప్రదర్శనలు



చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో గణిత క్విజ్ పోటీలు



దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో..

విద్యుత్ లైన్‌ను మార్చాలి



భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన తీగల లైన్‌ను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. శుక్రవారం వారు మాట్లాడారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం తమ ఇళ్లు, ప్లాట్ల మీద నుంచి తీగలు వెళ్తున్నాయని, దీనివల్ల తమకు ఇబ్బంది లు కలుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ లైన్ తీగలను మార్చాలని కోరుతూ విద్యుత్ ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లో వినతి పత్రాలను పంపించారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు ఎదుగుతారు

- ఎంవీఐ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంవీఐ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు ఎదుగుతారని కామారెడ్డి ఎంవీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాసంపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన జాతీయ గణిత దినోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ, పట్టుదల సమయపాలన ఉంటే రామానుజన్ మాదిరిగా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా అన్ని పాఠశాలలో విద్యార్థులకు రంగవల్లి వ్యాసరచన, ఉపన్యాస, పాటల పోటీలు, గణిత ముగ్గులు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఆయన స్ఫూర్తితో గణితంపై ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ ఎస్ మంజుల నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ బాలకిషన్‌గౌడ్, ఎంపీటీసీ భాగ్యలక్ష్మీ రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు గీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పెండింగ్ చలానాలపై డిస్కౌంట్

లింగంపేట(ఎల్లారెడ్డి): వాహనాలపై ఉన్న పెండింగ్ చలానులు డిస్కౌంట్‌లో కట్టడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 26 నుంచి జనవరి 10 లోపు చెల్లించవచ్చన్నారు.

మత్తమాల పీహెచ్‌సీని పరిశీలించిన ఎంపీపీ మాధవి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాల పీహెచ్‌సీని ఎంపీపీ మాధవి శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రి ఆవరణను పరిశీలించి పేషంట్లకు సక్రమంగా వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మల్కాపూర్ అంగన్వాడి కేంద్రం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ శరత్ సిబ్బంది పాల్గొన్నారు

నేడు ఎల్ఐసీ పథకాలపై గ్రామాల్లో ప్రచారం

కామారెడ్డి అర్బన్: ఎల్ఐసీ సామాజిక పథకాలు, పాలసీలపై శనివారం లింగంపేట మండలం భవానీపేట, లింగంపేట, బోనల్, బాయంపల్లి, నల్లమడుగు, బాణాపూర్, కొర్పోల్, రామలక్ష్మన్‌పల్లి, గాంధారి, లక్ష్మాపూర్ గ్రామాల్లో ప్రచార రథం పర్యటిస్తుందని ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఇంచార్జి మేనేజర్ వి.రామచంద్రం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎల్ఐసీ బీమా గ్రామం, బీమా స్కూల్ తదితర పథకాలు తెలుసుకొని లబ్ధి పొందాలన్నారు.

అయ్యప్ప కిరీటానికి 10గ్రాముల బంగారం అందజేత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆలయంలోని అయ్యప్ప స్వామి విగ్రహానికి బంగారు కిరీటం కోసం తనవంతుగా 10 గ్రాముల బంగారాన్ని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పట్నం రమేష్, తదితరులున్నారు.

ట్రాక్టర్, కారు ఢీ

లింగంపేట(ఎల్లారెడ్డి): పర్మళ్ల తండా వద్ద ట్రాక్టర్–కారు ఢీనడంతో రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. తండాలోని శివరాంనకు చెందిన ట్రాక్టర్, పోచారంలోని సంజీవరావుకు చెందిన కారు.. పర్మళ్ల తండాలోకి ఒకే వైపు నుంచి వెళ్తుండగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇరువురు లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): పుల్కల్‌లో మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. తెల్లవారుజామున ఇసుకను పిట్లం తరలిస్తుండగా పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. ట్రాక్టర్లను మైన్స్ శాఖకు అప్పగిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యేను కలిసిన బీసీ యువజన సంఘం నేతలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): జాతీయ బీసీ యువజన సంఘం నాయకులు ఎల్లారెడ్డిలో ఉన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా వ్యవస్థలో సమస్యలు, యువతకు ఉపాధి, గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు, నూతన డిగ్రీ కళాశాలల ఏర్పాటుపై చర్చించారు.నాయకులు రాజీవ్ కుమార్, అఖిల్‌రావు, అన్వేశ్‌రావు, సుభాష్, భాను పాల్గొన్నారు.